# సౌభాగ్యానికి సోపానాలు

వాసంతి రెండు రోజులు పుట్టింటికి వెళ్ళి వచ్చేసరికి, ఆమెను ఆశ్చర్య పరచే సంఘటన జరిగింది. అదే మరొకరికైతే అద్భుతంగానూ, ఆశ్చర్యంగానూ అనిపించకపోయేదేమో. తను వెళ్ళేసరికి తాళం వేసి వెలవెలబోతున్న ప్రక్క వాటా ఇప్పుడు నిండుగా కలకలలాడిపోతోంది. పద్మావతి వెళ్ళిపోయాక ఆ ఇంట్లోకి ఎందరెందరో రావటం అంటూ వచ్చారు కానీ, పద్మావతిలా తనకు సన్నిహితం కాలేదు. నెలరోజుల నుంచి అస్సలు మనుషులంటూ లేరు. ఆ వాటా ఖాళీగా వుండటం తనకు ఏదో వెలితిగా తోచేది. పరిచయం లేక పోయినా ప్రక్కవాటాలో సందడి ఏదో కాలక్షేపంగా అనిపించేది. అయినా ఎవరితో మాత్రం తనకు పరిచయం పెంచుకొనే తీరుబడి ఎక్కడ? అయినా ప్రక్కింట్లోకి మనుష్యులు రావటం సంతోషంగా అనిపించింది.

వాసంతి వంట పూర్తి చేసుకొని కొత్తగా వచ్చిన ఆమెను పలకరించాలని వెళ్ళింది. జయంతి ఆహ్వానం ఎంతో స్నేహ పూరితంగా అనిపించింది. నవ్వుతూ, నవ్విస్తూ మాట్లాడే ఆమె తీరు వాసంతిని ఇట్టే ఆకట్టుకుంది. కాస్సేపటిలోనే, ఆమె ఎం.ఎ., చదివిందనీ, రచయిత్రి అనీ తెలుసుకుని మరీ సంతోషించింది వాసంతి. "ఇక వెళ్ళొస్తానండీ" అంటూ లేచింది. "రేపు కాస్త తీరుబడిగా రండి. హాయిగా మాట్లాడుకోవచ్చు." జయంతి మాటలలో ఆమె స్నేహ హృదయం అర్థమైంది వాసంతికి. "నాకంత తీరికెక్కడిదీ! రోజూ ఆదరాబాదరా వంట చేసుకొని, పాపాయిని పనిపిల్లకు అప్పగించి ఆఫీసుకు వెళ్ళేసరికే ఎంతోకాలం కరిగిపోయేట్టు అనిపిస్తుంది. సాయంత్రం ఇంటికి వచ్చేక సరేసరి రోజు ఎలా గడుస్తుందో ఇక చెప్పలేను. మనం హాయిగా కబుర్ల కాలక్షేపం చెయ్యాలంటే ఆదివారం కోసమో, ఏ శలవు రోజు కోసమో ఎదురు చూడవలసిందే."

వాసంతి వెళ్ళిపోయింది. వాళ్ళ మధ్య పరిచయం స్నేహంగా మారుతూ వచ్చింది. ఒకరిని గురించి మరొకరు ఆలోచిస్తూ వుండేవారు. అసలు జయంతి ఉద్యోగం చేస్తే ఏం! ఆమెకు అన్ని అర్హతలూ వున్నాయి కదా అని వాసంతి ఆలోచిస్తే; వాసంతి ఎందుకంత ప్రయాసపడాలి? ఉద్యోగం చేయవలసిన అవసరం తనకేముంది? నిజానికి వాసంతి ఉద్యోగం చేయకపోతే ఆమెకు ఇంత శ్రమ వుండేదా! తన ఇంటి పని తనే చేసుకొవటంలోనూ, కన్నబిడ్డను కళ్ళల్లో పెట్టి పెంచుకోవటంలోనూ తనకెంతో తృప్తి లభించేదేమో..... జయంతి మనసులో ఈ ఆలోచనలు. ఒకసారి వాసంతి తన మనసులో మాట జయంతిని అడిగేసింది. "మీరెందుకు ఉద్యోగం చేయకూడదు!" అని. జయంతికి నవ్వు వచ్చింది.

"చేస్తూనే వున్నానుగా; ఇంతకన్న మంచి ఉద్యోగం ఏముంది చెప్పండి!" నవ్వుతూ అంది.

"నా మాట అలా తేలికగా తీసేయకండి. ఇంట్లో ఎంత శ్రమించినా విలువేముంటుంది? మనం ఉద్యోగం చేసి సంపాదిస్తే ఆర్థికంగా స్వాతంత్ర్యం వుంటుంది కదా." జయంతి మళ్ళా నవ్వి అంది... "ఆర్థికంగా స్వాతంత్ర్యం వుండాలంటే ఉద్యోగమే చేయాలా! అలా మీరంటే అందుకు నేనంగీకరించలేను. మనం పొదుపరితనం అలవర్చుకుంటే చాలు. చూడండీ... ఇంటి పనులు చేసేందుకు పనివాళ్ళకోసం ఎంతో డబ్బు ఖర్చు చేస్తాం. అలాకాక, అంట్లు తోముకోవటం, బట్టలు ఉతికి ఇస్త్రీ చేసుకోవటం ఇలాటి పనులు స్వయంగా చేసుకొంటే అది ఉద్యోగం కాదా?" ప్రశ్నార్థకంగా వాసంతి ముఖంలోకి చూసింది.

జయంతి మాటల వల్ల కలిగిన చిరాకును, కోపాన్ని అణచిపెట్టే ప్రయత్నం చేస్తూ, "మీరు ఎంత చెప్పినా ఇది నాకు సబబుగా అనిపించటం లేదు. ఉద్యోగం చేయకపోతే మన చదువుకు సార్థకత ఎలా వస్తుంది? మగవాళ్ళు సంపాదిస్తూ వుంటే, వాళ్ళ సంపాదన మీద ఆధారపడి బ్రతకడం బానిసత్వం అనిపించుకోదూ?"

వాసంతి తెలివి తక్కువ తనం జాలి కలిగించింది జయంతికి. "మీరు పొరబడుతున్నారు. సంసార రథానికి భార్యా భర్తలు చక్రాలవంటి వారు. సక్రమంగా సాగిపోవాలంటే ఎవరి విధి వారు నిర్వహిస్తే చాలు. ఇందులో ఒకరి అధికారము, మరొకరి బానిసత్వం ఏం వుంటుంది? భర్తల సంపాదన మీద ఆధారపడి బ్రతుకుతున్నామని భార్యలు అనుకుంటే, వాళ్ళు వంట చేసి పెడితే కాని ఏ పూటా గడవదు, ఇల్లంటే ఆడవాళ్ళ రాజ్యం అని భర్తలు అనుకుంటే ఇక సంసారాలు ఎలా వుంటాయి చెప్పండి."

జయంతి మాటలు శ్రద్ధగా వింటోంది వాసంతి. అది గమనించిన జయంతికి వాసంతిలో మార్పు తీసుకురావటం కష్టం కాదని అర్థమయింది. వాసంతి భుజం మీద ఆప్యాయంగా చేయి వేసి "ఆలోచిస్తే, అన్నీ మీకే అవగాహన అవుతాయి" అంది.

కాల ప్రవాహంలో మరికొన్ని రోజులు గడిచిపోయాయి. వాసంతికి జీవితం మరీ యాంత్రికంగా అనిపించసాగింది. అప్పుడప్పుడు జయంతి భావాలే సరైనవేమో అనే ఊహ ఆమె మనసులో మెదల సాగింది.

ఓరోజు వాసంతికి ఆఫీసులో పని ఎక్కువగా వుండటం వల్ల ఇంటికి వచ్చేసరికి బాగా పొద్దుపోయింది. వంట చేసుకోవటం ఈ పూట తనకి సాధ్య పడదేమో అనిపించింది. ఇంటికి రాగానే మంచంమీద వాలిపోయింది.

"వసూ! బాగా అలసిపోయినట్లున్నావ్. ఈ రోజు పని ఎక్కువగా వుందా?" భర్త ఆత్మీయంగా అడిగే సరికి వాసంతి అలసట సగం మాయమైంది. "అవునండీ, కాస్త పని ఎక్కువగానే వుంది, అయినా ఈ మధ్య ఆఫీసులోనూ, ఇంట్లోనూ పని చేసుకోవటం కష్టమనిపిస్తోంది...." అంటూ లేచి కూర్చుంది.

"అవును వసూ! నేను చెప్తూనే వున్నాను. నువ్వు అనవసరంగా శ్రమిస్తున్నావని. నిజానికి నువ్వు ఉద్యోగం చేయవలసిన అవసరం ఏముంది చెప్పు!" మదన్ వాసంతి ప్రక్కనే కూర్చుంటూ అన్నాడు.

"పాపాయ్ ఏది!"

"అది నేను ఎంత సముదాయించినా నా దగ్గర వుండడంలేదు. ఇప్పుడే జయంతిగారు వచ్చి తీసుకు వెళ్ళేరు." వాసంతికి ఆ మాటలు ఏదో వెగటుగా అనిపించాయి. తీసుకొచ్చేద్దామని జయంతి దగ్గరకు వెళ్ళింది. పాపాయిని ఒళ్ళో వేసుకొని ఆడిస్తోంది జయంతి. చిన్నారి, కళ్ళతోనే జయంతిని పలకరిస్తూ బోసి నవ్వులతో మురిపిస్తోంది. జయంతి మైమరచి ముద్దుల వర్షం కురిపించి హృదయానికి హత్తుకుంటే, ఆ వెచ్చదనానికీ, లాలనకు, పులకరించి పాపాయి కేరింతలు కొడుతోంది. ఆ దృశ్యం వాసంతికి ఏదోలా అనిపించింది.

జయంతి ఎంత హాయిగా పాపను లాలిస్తోంది! తను ఒక్కరోజయినా తన ఆలనా, పాలనా ఇంతగా పాపాయికి అందివ్వగలిగిందా? అయితే, మాతృత్వపు మాధుర్యం పూర్తిగా చవిచూపలేక పోతోందా తను!

"ఏఁవిటీ! అలా చూస్తున్నారు? మీ పాపాయి, నేనూ దోస్తీ అయి పోయామనా!" అంది. వాసంతి మౌనంగా పాపను అందుకోబోయింది. జయంతికి దూరం కావటం ఇష్టం లేనట్టుగా పాపమరింతగా పెనవేసుకు పోయింది.

"చూడండి? ఈ కాస్సేపట్లోనే పాప మీ కతుక్కుపోయింది!" వాసంతి మనసులో ఆవేదన మాటల్లో ఆశ్చర్యం....

"దానికేముందీ, మీ పనిపిల్ల సముదాయించ లేకపోతే నేను చేరదీశాను. ఇప్పుడు నా దగ్గర బాగా అలవాటయింది.....మీపాపకి. మీ చేతుల్లోకి రానంటోంది అంతే." ఆ మాటలు జయంతి తేలికగానే అన్నా, వాసంతి లోని మాతృహృదయం కలుక్కుమంది. పాపాయిని తీసుకొని ఇంటికి వచ్చే సరికి మదన్ అప్పుడే తను చేసిన ఉప్మా ప్లేట్లల్లో సర్దుతున్నాడు.

"అరె! మీరు టిఫెన్ తయారు చేశారా!" పాపని ఉయ్యాలలో పడుకో బెడుతూ అంది.

"అవును - వసూ! ఈ రోజు నువ్వు అలసిపోయావని నేనే చేశాను. రోజూ ఏవేళకైనా పనులన్నీ నువ్వే చేసుకుంటున్నావుగా" సర్దిచెప్పేడు. టిఫెన్ చేస్తున్నదే కానీ, వాసంతి మనసు మనసులో లేదు. తను శ్రీవారిని సరిగా సుఖపెట్టలేక పోతోంది. కన్నబిడ్డని ఆప్యాయత, అనురాగాలతో పెంచలేక పోతోంది. జయంతి అన్నది నిజమే. స్త్రీలు ఉద్యోగాలు చెయ్యటానికి ముఖ్యమైంది అవసరం; కానీ - అర్హత కాదు. అవసరం లేకపోయినా అర్హత వుందని తనబోటి స్త్రీలు ఉద్యోగాలకు ఎగబడి, నిరుద్యోగుల జాబితాను పెంచేస్తున్నారు. ఆ జీతం తను సరిగా వినియోగించగలిగితే అంతకన్నా ఉన్నతమైన ఉద్యోగం ఏముంది? మంచం మీద పడుకున్నా

ఇవే ఆలోచనలు వాసంతి మనసులో ముసురుకొంటున్నాయి. ఒక్కసారిగా ఉయ్యాలలో పాప ఏడవటంతో లేచి వెళ్ళి, తీసి ప్రక్కలో వేసుకుంది. తల్లి చేరువలోని వెచ్చదనానికి పాపాయి ఏడ్పు మానేసింది. మళ్ళీ వెచ్చదనం తనకు దూరమైపోతుందేమో అన్నట్టు అమ్మను తన చిట్టి చేతుల్తో గట్టిగా పట్టేసుకుంది.

★ ★ ★

"కంగ్రాట్యులేషన్స్ వసూ; ఇక గృహలక్ష్మివై ఈ రాజ్యాన్ని పరిపాలించటంలో కృతార్థురాలివి కావాలి." అన్నాడు నాటకీయంగా; మదన్, వాసంతి రాసి ఇచ్చిన కాగితం ఫెళఫెళలాడిస్తూ.

★ ★ ★

మరునాటి మధ్యాహ్నం ఇంట్లో పనులన్నీ ముగించుకొని వాసంతి తీరుబడిగా జయంతి దగ్గరకు వెళ్ళింది.

"ఈ రోజు ఆఫీసు లేదా?"

"ఈ రోజే కాదు. ఇంకేరోజూ ఉండదు. ఉండదా- అంటే, ఆఫీసు అక్కడే ఉంటుంది; నేను మాత్రం వెళ్లను. ఆ ఆఫీసుకి రాజీనామా చేసి; 'గృహ రాజ్యం' అనే ఈ ఆఫీసుకు మేనేజరుగా చేరేను."

ఆ ఇద్దరు వనితల గుండెల నిండా తృప్తి, ఆత్మవిశ్వాసం.

●

("వనిత" మాసపత్రిక - జులై 1994.)